బీజేఆర్ కాలేజీని సందర్శించిన ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎంఎస్ కుమార్

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీని గురువారం సికింద్రాబాద్ ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎం.ఎస్.కుమార్, ఐటీ నేవీ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ రామచందర్ రావు సందర్శించారు. కాలేజీలోని నేవీ ఎన్‌సీసీ రూం, ఫైల్స్‌ను పర్యవేక్షించి, గ్రూప్ కమాండర్, ఎన్‌సీసీ యూనిట్‌కు సంబంధించి కాలేజీ కేడెట్లు రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికయ్యే వంటి విషయాలను తెలుసుకున్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్ కుమార్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ వి.మనోజ్ కుమార్, నేవీ పీఐ స్టాఫ్ కిషోర్, యజ్ఞేశ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల స్వాధీనాన్ని విరమించుకోవాలి

హిమాయత్‌నగర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూములను స్వాధీనపర్చుకోవాలనే ఆలోచనలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ నారాయణరావు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... విద్యార్థులపై బనాయించిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలన్నారు. విద్యార్థులపై పోలీసుల అత్యుత్సాహం, లాఠీచార్జి చేయడాన్ని ఖండించాలన్నారు. హెచ్‌సీయూ భూములను, పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఉద్యమిస్తున్న యూనివర్సిటీ విద్యార్థులకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఆ భూములు ప్రభుత్వం యూనివర్సిటీకి అప్పగించి, యూనివర్సిటీ పేరున రిజిస్ట్రేషన్ చెయాలన్నారు. ప్రజాస్వామిక హక్కుగా శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై అత్యుత్సాహం ప్రదర్శిస్తూ లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు పి.ఎం.రాజు, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


వెంకటేశ్వరశర్మ

ఫిలింనగర్: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... షేక్‌పేట ఓయూ కాలనీలో నివసించే వెంకటేశ్వరశర్మ(61) గత నెల 28వ తేదీన నల్లకుంటలో నివసించే తన కూతురు ఇంటికి వెళ్తున్నాని కొడుకు పృథ్వీకి చెప్పాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోయేసరికి తండ్రి గురించి వాకబు చేయగా తన దగ్గరకు రాలేదని ఆయన సోదరి తెలిపింది. దీంతో అన్ని ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో తన తండ్రి కనిపించడం లేదని పృథ్వీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిలింనగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 65182లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

అకారణంగా వైద్యుడిపై దాడి

భార్యపై కూడా దాడి చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: కారణం లేకుండా భౌతిక దాడులకు పాల్పడుతూ న్యూసెన్స్ చేస్తుండటమే కాకుండా అడగడానికి వెళ్లిన భార్యను అసభ్య పదజాలంతో దూషించిన పొరుగింటి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఓ వైద్యుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని స్వర్ణ హెవెన్స్‌లో నివసించే గోపీనాథ్ వృత్తిరీత్యా వైద్యుడు. తన ప్లాట్ ఎదురుగా ముసళ్ల రాజు ఉంటున్నాడు. తరచూ తనపై అకారణంగా దాడి చేస్తున్నాడని, ఈ క్రమంలోనే ఈ నెల 1వ తేదీన తనపై దాడి చేసే క్రమంలో కిందకు నెట్టేయడంతో పడిపోయాయనని, అంతటి ఆగకుండా చెప్పులతో దాడి చేశాడని గోపీనాథ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయాన్ని అడిగేందుకు వెళ్లిన ఆయన భార్యను సైతం అసభ్య పదజాలంతో దూషించాడంటూ తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

మైలార్‌దేవ్‌పల్లి: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవశరం ఎంతైనా ఉందని మాజీ కౌన్సిలర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సోమ శ్రీనివాస్‌గుప్తా తండ్రి కీర్తిశేషులు సోమ జగన్నాథం గుప్తా పేరునా బాబుల్‌రెడ్డినగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో సోమ అశోక్, సోమ సందీప్, ఆంజనేయులు, పి.జగన్, హనుమంత్, కిషోర్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.


కోఠి డీఎంహెచ్ఎస్ వద్ద కూలిన చెట్టు


కోఠి మెటర్నిటీ ఆసుపత్రి రోడ్డులో కూలిన చెట్టు

అకాల వర్షం.. ఆగమాగం

- రోడ్లపై భారీగా వరద ప్రవాహం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కూలిన చెట్లు, స్తంభించిన ట్రాఫిక్

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం డివిజన్లలో గురువారం మధ్యాహ్నం అకాల వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల రోడ్లపై భారీగా వరద ప్రవహించగా, మరోవైపు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద వచ్చి చేరింది. అలాగే పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. దీంతో వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే ఇరుక్కుని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోఠి డీఎంహెచ్ఎస్ ప్రాంతంలో చెట్లు పడిపోయాయి. అలాగే కోఠి మెటర్నిటీ ఆసుపత్రి వద్ద చెట్టు కూలడంతో అక్కడి ట్రాఫిక్ సిబ్బంది యుద్ధ ప్రాతిపాదికన వాటిని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


ఉప్పుగూడలో ఇళ్లలోకి చేరిన వరద


మ్యాన్‌హోల్ వద్ద పేరుకున్న చెత్తాచెదారం


ఛత్రినాక చౌరస్తాలో వరదలోనే వెళ్తున్న వాహనదారులు

5న స్పేస్ ఎక్స్‌పో

మైలార్‌దేవ్‌పల్లి: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ నేతృత్వంలోని జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్, కేఐ ల్యాబ్ సహకారంతో కాటేదాన్ శాంతినగర్‌లోని రవిస్ బ్రిలియంట్ స్కూల్ ఆవరణలో ఈ నెల 5వ తేదీన స్పేస్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ఆర్.రజనీకాంత్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగే ఈ ఎక్స్‌పోలో విద్యార్థులకు పరిశోధనల నమూనాల తయారీకి కావాల్సిన అద్భుతమైన అనుభవం లభించనుందన్నారు. విద్యార్థుల్లో సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారాలను చూపే ఆలోచనల దిశగా ప్రదర్శన ఉంటుందన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మండల విద్యాధికారి కె.శంకర్ రాథోడ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి తదితరులు పాల్గొంటారని రజనీకాంత్ తెలిపారు.

రాములోరి కల్యాణోత్సవానికి ఆహ్వానం

రాజేంద్రనగర్: శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు రాజేంద్రనగర్ పరిధిలోని దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని దేవాలయాలను సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే రాములవారి దేవాలయాలను రంగు రంగులతో అందంగా తీర్చిదిద్దారు. హైదర్‌గూడ, సిరిమల్లెనగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఎర్రబోడ, బుద్వేల్, గ్రీన్ సిటీ, రాజేంద్రనగర్ ప్రాంతాల్లోని దేవాలయాలలో కల్యాణ మహోత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేపట్టారు. ప్రతి సంవత్సరం ఈ దేవాలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం శోభాయాత్రలను నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాలయాలతో పాటు బస్తీలు, కాలనీల్లో సైతం కల్యాణ మహోత్సవ ఏర్పాట్లు జోరందుకున్నాయి. కల్యాణానికి వచ్చే భక్తులకు ఇబ్బందులకు కలుగకుండా తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు ఘన నివాళి



గోల్కొండ: కార్వాన్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఉద్దడి జగదీశ్ కుమార్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేశ్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు గంజి రఘునాథ్‌రావు, బాలకృష్ణ, దుర్గరాజ్, చందు సాగర్, హరీశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన


నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: భారీ వర్షానికి జలమయమైన యాకుత్‌పురాలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి గురువారం పర్యటించారు. గంగానగర్ నాలా, ఈస్ట్ చంద్రానగర్, మదీనా నగర్, దోభీఘాట్, యక్రఫ్‌నగర్, మౌలా కా చిల్లా, రెయిన్‌బజార్ తదితర ప్రాంతాల్లో వరద రోడ్లపై నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు సకాలంలో స్పందించి సహాయక చర్యలు చేపట్టి స్థానికులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని వారు సూచించారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి


గుడిమల్కాపూర్ పూలే చౌరస్తా వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గోల్కొండ: కార్వాన్ గుడిమల్కాపూర్‌లో, అలాగే కార్వాన్ బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శారదానగర్ పూలే చౌరస్తా వద్ద నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కార్వాన్ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు కె.అనిల్‌కుమార్, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్, పంబి శ్రీనివాస్, దేవర వంశీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దేవర వంశీ ఆధ్వర్యంలోనూ జయంతి వేడుకలు నిర్వహించారు.


బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ..

శ్రీరామనవమి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి


నిర్వాహకులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు

విజయనగర్‌కాలనీ: శ్రీరామనవమి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు సూచించారు. బస్తీలు, కాలనీల్లో సీతారాముల కల్యాణం జరిపించే నిర్వాహకులతో టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కల్యాణం అనంతరం నిర్వహించే శోభాయాత్ర రూట్‌ను పోలీసులకు అందించాలన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ.మహ్మద్ అమ్జద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు, ర్యాలీలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

గోల్కొండ: ఉత్సవాలు, ర్యాలీలు ప్రశాంతంగా జరుపుకోవాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగలు, ఊరేగింపుల సమయాల్లో అసాంఘిక శక్తులు పుకార్లు వ్యాపింపజేస్తాయని వాటిని నమ్మవద్దని కోరారు. శ్రీరామనవమికి ర్యాలీలు నిర్వహించే వారు అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు ఆలయాలు, ప్రార్థన స్థలాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోని వారు వెంటనే అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డీఎస్సై రఫీ, ఆబిద్, మిర్జా ఎక్బాల్ అహ్మద్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

అలరించిన ‘అన్నమయ్య’ హరికథ

నాంపల్లి: శ్రీ రామభక్త సమాజం (నాంపల్లి) ఆధ్వర్యంలో 89వ సీతారామ వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాంపల్లి రైల్వే గూడ్స్ గేట్ వద్ద ఉన్న శ్రీరామ హనుమాన్ మందిరం వద్ద గతల నెల 30న ప్రారంభం కాగా ఈనెల 9న ముగుస్తాయి. 6న గణపతి పూజ, పుణ్యాహవాచనం, శ్రీ సీతారామ కల్యాణం, సంతర్పణ, పల్లకీ ఊరేగింపు, చెండ్లాడింపు, మేజువాణి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు సీతారాములు వివాహానికి పసుపు కొమ్ములు దంచుడు వేడుక జరిగింది. రాత్రి 8 గంటలకు జంధ్యాల కృష్ణకుమారి భాగవతారిణిచే నిర్వహించిన ‘అన్నమయ్య’ హరికథ అలరింపజేసింది.

6న సీతారాముల కల్యాణం

సంతోష్‌నగర్: స్థానిక పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 6న ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ నల్లదీగల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో మహోత్సవం కొనసాగుతుందని కల్యాణం జరిపించే కన్యాదాతలు రూ.1000లు చెల్లించాలని పేర్కొన్నారు. సాయంత్రం 6 నుంచి సీతారామచంద్ర స్వామి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు పిలుపునిచ్చారు.

ఆర్.కృష్ణయ్యకు పూలే ఎక్సలెన్సీ అవార్డు

గన్‌ఫౌండ్రీ: ఈ ఏడాది మహాత్మా జ్యోతిరావు పూలే ఎక్సలెన్సీ అవార్డును రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు అందజేయనున్నట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో పూలే జయంతిని పురస్కరించుకుని ఆయనకు అవార్డు అందజేసి సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. 50 ఏళ్లుగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషికి ఈ అవార్డు నిదర్శనమని తెలిపారు.

మహంకాళి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడి మృతి


బాలరాజ్ ముదిరాజ్(ఫైల్)

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎం.బాలరాజ్ ముదిరాజ్ గురువారం కన్నుమూశారు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆలయ కమిటీ కోశాధికారి, అధ్యక్షుడిగా పని చేసిన ఆయన తదనంతరం ఆలయానికి సంబంధించి ప్రత్యేక విషయాల్లో పెద్దగా వ్యవహరించారు. ఆయన మృతితో ఆలయ కమిటీ ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. శుక్రవారం నల్లవాగు హిందూ శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం


కోఠి డీఎంహెచ్‌ఎస్ వద్ద ధర్నా చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ అన్నారు. కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెగ్యులర్‌గా ఏఎన్‌ఎంలు విధులు నిర్వహించే కాలానికి తగిన పారితోషికం ఇవ్వాలన్నారు. మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసిన నోటిఫికేషన్ 2023 పరీక్ష ఫలితాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 52 ఏళ్లు దాటిన వారు పరీక్ష రాసే అవకాశం తమ పోరాటం వల్లే వచ్చిందని, కానీ ఫలితాలు ఆలస్యంగా వస్తుండడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. అధికారులు సత్వరమే స్పందించి ఫలితాలు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జక్కుల పద్మ, బోయిని శ్యామల, తన్వీన్ సుల్తానా, జయమ్మ, సంధ్యారాణి, కృష్ణవేణి, ఏఎన్‌ఎంలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పగిలిన కృష్ణా వాటర్ పైప్‌లైన్


పైప్‌లైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నుంచి బండ్లగూడకు వెళ్లే ప్రధాన రహదారిపై ఓ.ఎస్.ఫంక్షన్ హాల్ సమీపంలో కృష్ణా వాటర్ 1600 డయా పైప్‌లైన్ గురువారం ఉదయం పగిలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు కింద 10 అడుగుల లోతు నుంచి నీరు ఎగిసిపడడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనునాయక్ జలమండలి అధికారులకు తెలపడంతో వారు వెంటనే నీటి సరఫరాను నిలిపివేశారు. అనంతరం ప్రొక్లెయిన్‌తో రోడ్డును తవ్వి సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఏటవాలుగా ఉన్న ప్రాంతం కావడంతో నీటి సరఫరా ఆపినా కూడా నీరు భారీగా లీకవ్వడంతో మరమ్మతులకు ఆటంకం కలిగింది. సాయంత్రం 5 గంటల వరకు మరమ్మతులు పూర్తి చేసి, గుంతను కాంక్రీట్‌తో పూడ్చివేసి రాకపోకలు పునరుద్ధరించారు.


చాంద్రాయణగుట్టలో నిలిచిన వాహనాలు

కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు


వివిధ విభాగాల వైద్యులతో డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు

గోల్కొండ: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్నాయని గోల్కొండ ఏరియాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. కాయాకల్ప్ పీర్ అసెస్‌మెంట్‌లో భాగంగా గోల్కొండ ఏరియా ఆసుపత్రి వైద్య బృందం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిని గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల వైద్యులు తమ అభిప్రాయాలను ఒకరితో మరొకరు పంచుకోవచ్చన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల సమాచారం మేరకు... పల్లెచెరువు నుంచి మహవీర్ కాలేజీకి వెళ్లే దారిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకోని పరిశీలించగా 40–45 సంవత్సరాల ఉండే వ్యక్తి చనిపోయి ఉన్నాడన్నారు. స్థానికంగా ఆచూకీ కోసం ప్రయత్నించగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని తెలిసిందన్నారు. అనారోగ్య కారణంగా చనిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.